సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక
సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

PRGI - TGTEL/25/A0348
జాతీయ తెలుగు దినపత్రిక
Published by
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
# సందేశం టైమ్స్
నిజం దాగదు - వార్త ఆగదు

Sandesham Times
Scan to Download
Download
Download Now
Get it on on Google Play
శెట్టి వెంకటేష్ సీఈఓ
(9052045435)

ఆదివారం 19 జూలై 2026 | ● పేజీలు : 08 | ● వెల: 2/- | ● సంపుటి: 2 . సంచిక : 47 | ● ప్రచురణ : సూర్యాపేట | ● ఎడిటర్: శెట్టి వెంకటేష్



## విక్రమ్-1 రాకెట్ విజయవంతం.. భారత ప్రైవేట్ అంతరిక్ష రంగంలో చారిత్రక ఘట్టం

శ్రీహరికోట | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: భారత ప్రైవేట్ అంతరిక్ష రంగంలో మరో చారిత్రక మైలురాయిగా స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ అభివృద్ధి చేసిన విక్రమ్-1 రాకెట్ శనివారం శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రం (షార్) నుంచి విజయవంతంగా నింగిలోకి దూసుకెళ్లింది. షెడ్యూల్ ప్రకారం జరగాల్సిన ఈ ప్రయోగం స్వల్ప సాంకేతిక కారణాల వల్ల సుమారు అరగంట ఆలస్యమైనప్పటికీ, అనంతరం విజయవంతంగా నిర్వహించి శాస్త్రవేత్తలు నిర్దేశించిన అన్ని లక్ష్యాలను సాధించారు. పూర్తిగా స్వదేశీ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన ఈ రాకెట్ సుమారు 350 కిలోల బరువున్న ఉపగ్రహాలను భూమికి అత్యంత సమీపంలోని లో-ఎర్త్ ఆర్బిట్ (LEO)లో అత్యంత ఖచ్చితత్వంతో ప్రవేశపెట్టి తన సామర్థ్యాన్ని నిరూపించింది. భారతదేశంలో ప్రైవేట్ రంగం ద్వారా అంతరిక్ష ప్రయోగాలకు ఇది కీలక ముందడుగుగా నిలవడంతో పాటు దేశీయ అంతరిక్ష పరిశ్రమకు మరింత ఊతాన్ని అందించనుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రయోగాన్ని ఇస్రో, స్కైరూట్ ఏరోస్పేస్ శాస్త్రవేత్తలు అత్యంత నిశితంగా పర్యవేక్షించి విజయవంతంగా పూర్తి చేయగా, వారి కృషిని ఇస్రో ఛైర్మన్ ప్రత్యేకంగా అభినందించారు. భవిష్యత్‌లో మరిన్ని ప్రైవేట్ అంతరిక్ష ప్రయోగాలకు ఈ విజయం మార్గదర్శకంగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.







## గుంటూరు ఘటనపై సీఎం చంద్రబాబు, మాజీ సీఎం జగన్ స్పందన.. నిందితులపై కఠిన చర్యలకు ఆదేశాలు, ప్రభుత్వంపై విమర్శలు

అమరావతి | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: గుంటూరు నగరంలోని కృష్ణబాబు కాలనీలో మహిళపై జరిగిన దాడి ఘటన రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారితీయగా, ఈ ఘటనపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి స్పందించారు. ఈ సంఘటన తనను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మహిళలను అవమానించే చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు. ఘటనపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు వెల్లడిస్తూ, నిందితుడిపై క్రిమినల్ కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు, ఘటనకు సంబంధం ఉన్న వ్యక్తిని పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు తెలిపారు. చట్టం ముందు అందరూ సమానమేనని, రాజకీయ పార్టీల పేరు చెప్పుకుని తప్పులు చేసే వారికి ఎలాంటి రక్షణ ఉండదని పేర్కొంటూ, రాష్ట్రంలోని ప్రతి మహిళకు గౌరవం, భద్రత కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మరోవైపు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ ఘటనపై తీవ్ర విమర్శలు చేస్తూ, రాష్ట్రంలో శాంతిభద్రతల వైఫల్యానికి ఇది నిదర్శనమని ఆరోపించారు. బాధితురాలు తొలిసారి ఫిర్యాదు చేసినప్పుడే పోలీసులు స్పందించి ఉంటే ఈ ఘటన మరింత తీవ్రమయ్యేది కాదని పేర్కొన్న ఆయన, వీడియోలు వెలుగులోకి వచ్చిన తర్వాత మాత్రమే చర్యలు తీసుకోవడం సరికాదని విమర్శించారు. పోలీసు వ్యవస్థ అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ, మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వ్యాఖ్యానించారు. ఈ ఘటనపై రాజకీయ విమర్శలు కొనసాగుతుండగా, పోలీసులు కేసు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.



## ఉద్యోగాల హామీలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కేటీఆర్ తీవ్రంగా ప్రశ్నించారు

హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: రాష్ట్రంలో ఉద్యోగాల భర్తీ అంశంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. ఉద్యోగాలు అడిగిన నిరుద్యోగులకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం వారిని నిరాశకు గురిచేస్తోందని ఆరోపించారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తొలి ఏడాదిలోనే రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని ప్రకటించి, నవంబర్ 2023లో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి "ఓటు కొట్టు.. జాబ్ పట్టు" అంటూ ప్రచారం నిర్వహించిందని గుర్తు చేశారు. అయితే ప్రస్తుతం ఆ హామీల అమలుపై ప్రభుత్వం స్పందించడం లేదని, ఉద్యోగాల భర్తీ విషయంలో ఎలాంటి పురోగతి కనిపించడం లేదని విమర్శించారు. జాబ్ క్యాలెండర్ అమలుకు బదులుగా స్కామ్ క్యాలెండర్ అమలవుతోందని ఆరోపిస్తూ, రాహుల్ గాంధీ జేబులు మాత్రమే నిండుతున్నాయని వ్యాఖ్యానించారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కూడా తీవ్ర వ్యాఖ్యలు చేస్తూ, నిరుద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.



## ఆహార, ఔషధ కల్తీలపై కఠిన చట్టానికి సీఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: రాష్ట్రంలో ఆహార పదార్థాలు, ఔషధాల్లో కల్తీలను అరికట్టేందుకు కఠిన చట్టాన్ని రూపొందించాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎంసీహెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో తెలంగాణ ఆహార కల్తీ, ఔషధ నియంత్రణ చట్టం (TGFADCA)పై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నిత్యావసర వస్తువులు, కూరగాయలు, ఆకుకూరలు, పండ్లు, పాలు వంటి ఆహార పదార్థాల్లో విచ్చలవిడిగా కల్తీలు జరుగుతున్నందున ప్రజలు తీవ్ర అనారోగ్యాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పండ్లు త్వరగా మగ్గేందుకు, కూరగాయలు, పాల ఉత్పత్తులు ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు ప్రమాదకర రసాయనాలను వినియోగించడం ఆరోగ్యానికి ముప్పుగా మారిందన్నారు. ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం వల్ల వ్యవసాయ ఉత్పత్తుల్లో రసాయన అవశేషాలు పెరిగి, కొన్ని దేశాలు దిగుమతులను నిరాకరిస్తున్న విషయాన్ని ప్రస్తావించారు. మార్కెట్‌లో సేంద్రియ ఉత్పత్తుల పేరుతో విక్రయిస్తున్న వస్తువులు నిజంగా సేంద్రియమైనవేనా అనే అంశాన్ని నిర్ధారించే వ్యవస్థ అవసరమని పేర్కొన్నారు. కల్తీల నియంత్రణలో సమర్థవంతమైన చట్టాలు అమలు చేస్తున్న దేశాలను సందర్శించి అక్కడి విధానాలను అధ్యయనం చేసి సమగ్ర నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఆ నివేదిక ఆధారంగా చట్ట ముసాయిదా రూపొందించి శాసనసభలో చర్చించి ప్రజల అభిప్రాయాలను కూడా పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు. కల్తీలపై సమాచారం అందించేందుకు విజిల్‌బ్లోయర్ వ్యవస్థ, టోల్‌ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని, పైలట్ ప్రాజెక్టుగా క్యూర్ ప్రాంతంలో ఈ విధానాలను అమలు చేసి వచ్చిన అనుభవాల ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా విస్తరించాలని సూచించారు. సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్, ముఖ్యమంత్రి సలహాదారు కె. రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ప్రధాన కార్యదర్శులు వి. శేషాద్రి, ఎన్. శ్రీధర్‌తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సంభల్ జిల్లాలో రూ.569 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం.. ప్రజలకు సంక్షేమ పథకాల లబ్ధి పంపిణీ



సంభల్, ఉత్తరప్రదేశ్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: ఉత్తరప్రదేశ్‌లోని సంభల్ జిల్లా చందౌసీ, సంభల్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో రూ.569 కోట్లకు పైగా వ్యయంతో చేపట్టిన 66 అభివృద్ధి ప్రాజెక్టులకు ప్రారంభోత్సవం, శంకుస్థాపన కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. ఈ సందర్భంగా విఘ్నహర్త శ్రీ గణేశుడు, మర్యాద పురుషోత్తముడు శ్రీరాముడి భారీ విగ్రహాలను చందౌసీలో ఆవిష్కరించారు. అనంతరం వివిధ సంక్షేమ పథకాల లబ్ధిదారులకు ధ్రువపత్రాలు, చెక్కులు, గృహాల తాళాలు, నగదు రహిత వైద్య సేవల కార్డులను పంపిణీ చేశారు. సంభల్ జిల్లాను వారసత్వం, అభివృద్ధి సమన్వయంతో మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లడం ప్రభుత్వ లక్ష్యమని, భారతీయ ఆస్తిక భావాలపై ఎలాంటి అవమానకర చర్యలను డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఏమాత్రం సహించదని కార్యక్రమంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు, జిల్లా ప్రజలకు అభినందనలు తెలియజేశారు.

## ఆసియా అండర్-23 అథ్లెటిక్స్‌లో స్వర్ణం సాధించిన ప్రవల్లికకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు



హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: చైనాలోని ఒర్డోస్‌లో నిర్వహించిన తొలి ఆసియా అండర్-23 అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్-2026లో మహిళల 4×400 మీటర్ల రిలే విభాగంలో స్వర్ణ పతకం సాధించిన తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ (TGSWREIS) ఆధ్వర్యంలోని గురుకుల డిగ్రీ కళాశాల విద్యార్థిని నరిమళ్ల ప్రవల్లికను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఉన్నతాధికారులతో కలిసి ప్రవల్లిక హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు, దేశానికి గుర్తింపు తీసుకువచ్చిన ప్రవల్లికను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందిస్తూ, భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించి యువతకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాకారులకు అన్ని విధాలా అండగా నిలుస్తుందని ఆయన పేర్కొన్నారు.



## నీట్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన గురుకుల విద్యార్థులకు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు

హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: నీట్ (NEET) పరీక్షలో అత్యుత్తమ ర్యాంకులు సాధించి ప్రతిభ చాటిన తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ విద్యా సంస్థల (TGSWREIS) ఆధ్వర్యంలోని గురుకుల పాఠశాలల విద్యార్థులను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అభినందించారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఉన్నతాధికారులతో కలిసి విద్యార్థులు హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నీట్‌లో మంచి ర్యాంకులు సాధించి వైద్య విద్యలో ప్రవేశాలకు అర్హత సాధించిన విద్యార్థుల ప్రతిభను ముఖ్యమంత్రి ప్రశంసించారు. కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను సాధించిన విద్యార్థులు ఇతరులకు స్ఫూర్తిగా నిలుస్తారని పేర్కొన్నారు. గురుకుల విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, విద్యార్థుల భవిష్యత్‌కు అన్ని విధాలా సహకారం అందిస్తామని ముఖ్యమంత్రి తెలిపారు.

## విక్రమ్-1 టెస్ట్ ఫ్లైట్ విజయం.. స్కైరూట్ ఏరోస్పేస్‌కు సీఎం రేవంత్ రెడ్డి అభినందనలు

హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: పూర్తిగా స్వదేశీ సాంకేతికతతో అభివృద్ధి చేసిన ఆర్బిటల్-క్లాస్ ప్రయోగ వాహనం విక్రమ్-1ను విజయవంతంగా పరీక్షించిన హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థకు ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి హృదయపూర్వక అభినందనలు తెలిపారు. మిషన్ ఆగమన్‌లో భాగంగా నిర్వహించిన విక్రమ్-1 టెస్ట్ ఫ్లైట్-1 విజయం భారత అంతరిక్ష రంగ చరిత్రలో చారిత్రాత్మక ఘట్టమని, తెలంగాణకు గర్వకారణమని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అంతరిక్ష సాంకేతిక రంగంలో దేశం సాధిస్తున్న పురోగతికి స్కైరూట్ ఏరోస్పేస్ విజయం నిదర్శనమని అన్నారు. భారత యువ శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, ఆవిష్కర్తల ప్రతిభను ప్రపంచానికి చాటిచెప్పే ఘనత ఈ సంస్థకు దక్కిందని ప్రశంసించారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో శంషాబాద్‌లోని జీఎంఆర్ ఏరోస్పేస్ పార్క్‌లో ఉన్న స్కైరూట్ ఏరోస్పేస్ మ్యాక్స్-క్యాంపస్‌ను సందర్శించిన సందర్భంగా, మిషన్ ఆగమన్ ప్రయోగానికి ముందు విక్రమ్-1 ఫ్లైట్ హార్డ్‌వేర్‌ను శ్రీహరికోటలోని సతీష్ ధావన్ అంతరిక్ష కేంద్రానికి తరలించే కార్యక్రమాన్ని ప్రారంభించిన విషయాన్ని సీఎం గుర్తు చేశారు. విక్రమ్-1 విజయవంతమైన టెస్ట్ ఫ్లైట్ తెలంగాణను ప్రపంచ స్థాయి ఏరోస్పేస్, స్పేస్ టెక్నాలజీ కేంద్రంగా తీర్చిదిద్దే దిశలో మరో కీలక మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు. ఏరోస్పేస్ ఆవిష్కరణలు, అధునాతన తయారీ రంగం, తదుపరి తరం అంతరిక్ష సాంకేతికతల అభివృద్ధికి తెలంగాణ అనువైన కేంద్రంగా మరింత బలపడుతోందని తెలిపారు. స్కైరూట్ వంటి సంస్థల విజయాలు రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడంతో పాటు యువతలో శాస్త్ర, సాంకేతిక రంగాలపై ఆసక్తిని పెంచి, భవిష్యత్ ఆవిష్కర్తలు, పారిశ్రామికవేత్తలకు స్ఫూర్తిగా నిలుస్తాయని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు.

## అందెశ్రీ నాకు ఆత్మబంధువు.. ఆయన స్ఫూర్తి ప్రజా ప్రభుత్వానికి శ్రీరామ రక్ష: సీఎం రేవంత్ రెడ్డి



ఘట్‌కేసర్, హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: తెలంగాణ రాష్ట్ర గీత రచయిత, ప్రజాకవి డాక్టర్ అందెశ్రీ తనకు కేవలం ఉద్యమకారుడు మాత్రమే కాదని, ఆత్మబంధువని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. అందెశ్రీ జయంతి సందర్భంగా ఘట్‌కేసర్‌లో ఆయన స్మృతి వన నిర్మాణానికి ముఖ్యమంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో అందెశ్రీకి పుష్పాంజలి ఘటించిన సీఎం, ఆయన భార్య మల్లుబాయి, కుమార్తెలు వాక్కులమ్మ, వెన్నెల, వేకువ, కుమారుడు దత్తు సమక్షంలో భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ నాలుగు కోట్ల తెలంగాణ ప్రజలకు అందెశ్రీ కవిగా, గాయకుడిగా, తెలంగాణ ఉద్యమకారుడిగా పరిచయం ఉన్నప్పటికీ తనకు మాత్రం ఆయన ఆత్మబంధువని అన్నారు. అందెశ్రీ గానంలో ఉన్న గొప్పతనం, ఆయన గళంలో ఉన్న స్ఫూర్తి తనలో ఉద్యమ భావాలను నింపిందని, ఆ స్ఫూర్తితోనే తాను ముఖ్యమంత్రి స్థాయికి ఎదిగానని భావోద్వేగంతో తెలిపారు. తన కుటుంబంలో పెద్దన్న కోల్పోయిన తర్వాత తనకు పెద్దన్నలా కనిపించిన వ్యక్తి అందెశ్రీ అని గుర్తుచేసుకున్నారు. తెలంగాణ గడ్డపై ఆధిపత్యం ప్రదర్శించాలని, ఈ ప్రాంతాన్ని దోచుకోవాలని ఎవరైనా ప్రయత్నిస్తే అందెశ్రీలాంటి ఉద్యమ స్ఫూర్తి మళ్లీ పుడుతుందని హెచ్చరించారు. అందెశ్రీ స్ఫూర్తి ప్రజా ప్రభుత్వానికి శ్రీరామ రక్ష అని, గద్దర్, అందెశ్రీ వంటి ఉద్యమకారుల ఆశయాలతో ప్రభుత్వం ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో తమ జీవితాలను అంకితం చేసిన తొమ్మిది మందిని గుర్తించి, పార్టీలు, జెండాలు చూడకుండా వారి కుటుంబాలకు రూ.కోటి చొప్పున అందించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అది తన సొంత డబ్బు కాదని ప్రజల సొమ్ము అని తెలిపారు. అందెశ్రీ రచించిన 'జయ జయహే తెలంగాణ', 'మాయమైపోతున్నడమ్మా మనిషన్నవాడు' వంటి పాటలు కేవలం పాటలు కాదని, ప్రజల్లో ఉద్యమ స్ఫూర్తిని రగిలించిన శక్తివంతమైన ఆయుధాలని సీఎం కొనియాడారు. పదాలతో తెలంగాణ ప్రజల హృదయాల్లో ఉద్యమ భావజాలాన్ని నింపిన అందెశ్రీ, ఈ గడ్డపై పుట్టిన ప్రతి ఒక్కరినీ ఉద్యమ మార్గంలో నడిపించిన మహోన్నత వ్యక్తి అని స్మరించుకున్నారు. 2024 జూన్ 2న 'జయ జయహే తెలంగాణ' గీతాన్ని రాష్ట్ర గీతంగా జాతికి అంకితం చేసిన సందర్భంలో అందెశ్రీ భావోద్వేగానికి గురైన విషయాన్ని కూడా ముఖ్యమంత్రి గుర్తు చేశారు.



## మహిళా సాధికారతకు మరో ముందడుగు.. FICCI FLO కార్యాలయానికి స్థలం కేటాయిస్తాం: సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: రాష్ట్రంలో మహిళా సాధికారత కోసం ప్రజా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని, భారతీయ పరిశ్రమల సమాఖ్య మహిళా విభాగం ఫిక్కీ లేడీస్ ఆర్గనైజేషన్ (FLO) ప్రధాన కార్యాలయ నిర్మాణానికి శిల్పారామం పక్కన వెయ్యి గజాల స్థలాన్ని కేటాయిస్తామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రకటించారు. FICCI FLO ఏర్పడి 25 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ఆ విభాగం ప్రతినిధులు హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రిని కలిశారు. 2027 నాటికి ఫిక్కీ సంస్థ ఏర్పడి వంద సంవత్సరాలు పూర్తి చేసుకోనున్న నేపథ్యంలో చేపట్టనున్న కార్యక్రమాలను ప్రతినిధులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందితే దేశ అభివృద్ధి, ప్రజల జీవన ప్రమాణాలు మరింత మెరుగవుతాయని అన్నారు. హైటెక్ సిటీ, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (CII) కార్యాలయాల మధ్యలో FICCI FLO కార్యాలయం ఏర్పాటు చేయడం ద్వారా ఆ ప్రాంతం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని తెలిపారు. ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్న భారత్ ఫ్యూచర్ సిటీలో ఫిక్కీ భాగస్వామ్యం కావాలని కోరిన సీఎం, ఫిక్కీ ప్రధాన కార్యాలయం కోసం ఒక ఎకరం స్థలాన్ని కేటాయిస్తామని వెల్లడించారు. భారత్ ఫ్యూచర్ సిటీలో ఫార్చ్యూన్ 500 కంపెనీలను నెలకొల్పాలన్నది ప్రభుత్వ లక్ష్యమని, అందులో మహిళా పారిశ్రామికవేత్తల పాత్ర కీలకమవుతుందని పేర్కొన్నారు. ఫిక్కీ మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఇండస్ట్రియల్ పార్క్ విజయవంతమైన నేపథ్యంలో మహిళా సాధికారత కోసం మరో పారిశ్రామిక పార్క్ అభివృద్ధి చేసే అంశాన్ని పరిశీలిస్తామని తెలిపారు. మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా సహకరిస్తుందని, ప్రతి మూడు నెలలకు ఒకసారి ప్రత్యేక సమావేశం నిర్వహించి వారి సమస్యలు, అభివృద్ధి అంశాలపై సమీక్షిస్తామని చెప్పారు. వ్యాపార రంగంలో ప్రతిభ చూపుతున్న మహిళా సంఘాలను గుర్తించి ప్రతి సంవత్సరం ఫిక్కీ ఆధ్వర్యంలో అవార్డులు అందించి ప్రోత్సహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ముఖ్యమంత్రి సలహాదారు కె. రామకృష్ణారావు, FICCI FLO జాతీయ అధ్యక్షురాలు పూజా గార్గ్, FLO హైదరాబాద్ చైర్‌పర్సన్ సీతా రెడ్డి గడ్డం, పలువురు మహిళా పారిశ్రామికవేత్తలు పాల్గొన్నారు.

## వరి నాట్లు వేస్తున్న మహిళా కూలీల వద్దకు వెళ్లిన మంత్రి పొంగులేటి.. పల్లె ప్రజలతో ఆత్మీయ సంభాషణ



లింగారం తండా, ఖమ్మం జిల్లా | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: కూసుమంచి మండల పర్యటనలో భాగంగా పచ్చని చేలల్లో వరి నాట్లు వేస్తున్న మహిళా కూలీలను చూసి మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన కాన్వాయ్‌ను ఆపి వారిని కలిసి ఆత్మీయంగా మాట్లాడారు. మల్లాయిగూడెం పర్యటన ముగించుకుని లింగారం తండా, జుజ్జులరావ్ పేట గ్రామ శివార్ల మీదుగా కోక్యా తండాకు వెళ్తున్న సమయంలో పొలాల్లో శ్రమిస్తున్న మహిళా కూలీలను గమనించిన మంత్రి వెంటనే వాహనం దిగి వారి వద్దకు వెళ్లారు. ఎలాంటి హోదా ఆర్భాటాలు లేకుండా సాధారణ వ్యక్తిలా వారితో కలిసి వారి కష్టసుఖాలను, సమస్యలను, అవసరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అర్హత ఉన్న ప్రతి పేద కుటుంబానికి ఎలాంటి రాజకీయ వివక్ష లేకుండా ఇందిరమ్మ ఇళ్లను అందిస్తామని, ఉచిత విద్యుత్‌తో పాటు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు అండగా నిలుస్తాయని మంత్రి భరోసా ఇచ్చారు. మంత్రి మాటలు విన్న గ్రామీణ ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తూ, ప్రభుత్వంపై తమకు మరింత నమ్మకం పెరిగిందని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని పరిష్కరించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు.



## తక్కువ వర్షాల నేపథ్యంలో మెట్ట పంటల వైపు రైతులు దృష్టి సారించాలి: మంత్రి పొంగులేటి

కూసుమంచి, ఖమ్మం జిల్లా | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: ఎలినినో ప్రభావంతో ఈ ఏడాది వర్షపాతం తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్న నేపథ్యంలో రైతులు సాగు విధానాల్లో మార్పులు చేసుకోవాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న పంటలపై ఆధారపడకుండా తక్కువ నీటితో సాగు చేసే ప్రత్యామ్నాయ మెట్ట పంటల వైపు రైతులు దృష్టి సారించాలని ఆయన కోరారు. శనివారం పాలేరు నియోజకవర్గ పరిధిలోని కూసుమంచి మండలంలో విస్తృతంగా పర్యటించిన మంత్రి, పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొని మాట్లాడారు. ప్రజా ప్రభుత్వం ఎల్లప్పుడూ రైతుల పక్షాన ఉంటుందని, ఇప్పటికే రైతు భరోసా ద్వారా అన్నదాతలకు అండగా నిలిచామని తెలిపారు. మారుతున్న వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా శాస్త్రవేత్తల సూచనలు పాటిస్తూ ఆధునిక సాగు విధానాలను అవలంబించాలని సూచించారు. మండల పర్యటనలో భాగంగా మల్లాయిగూడెంలో రూ.2.52 కోట్లతో పెరికసింగారం ఎన్ఎస్పీ కెనాల్ నుంచి భగవాన్ తండా మీదుగా మల్లాయిగూడెం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, రూ.20 లక్షలతో నిర్మించనున్న గ్రామ పంచాయతీ కార్యాలయ భవనానికి మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం కోక్యా తండాలో రూ.1.69 కోట్లతో లింగారం తండా నుంచి లోక్యా తండా ఎన్ఎస్పీ కాలువ వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, అగ్రహారంలో రూ.20 లక్షలతో నిర్మించనున్న పంచాయతీ భవనానికి భూమిపూజ నిర్వహించారు. అనంతరం కూసుమంచి క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో లబ్ధిదారులకు సంక్షేమ పథకాల చెక్కులను పంపిణీ చేశారు. మండల వ్యాప్తంగా 66 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేయగా, వివిధ అనారోగ్య కారణాలతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న 111 మంది బాధితులకు రూ.35.16 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పాలేరు అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలి.. నాణ్యతలో రాజీ వద్దు: మంత్రి పొంగులేటి



కూసుమంచి, ఖమ్మం జిల్లా | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: పాలేరు నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగవంతం చేసి, ప్రజలకు వాటి ప్రయోజనాలు త్వరగా అందేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. శనివారం కూసుమంచిలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ అభివృద్ధి పనుల పురోగతిపై ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్., పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌లతో కలిసి వివిధ శాఖల అధికారులతో మంత్రి సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ శాఖల వారీగా మంజూరైన పనులు, టెండర్ల ప్రక్రియ, ప్రస్తుతం క్షేత్రస్థాయిలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక కారణాలతో నిలిచిపోయిన టెండర్ల సమస్యలను వెంటనే పరిష్కరించి పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అభివృద్ధి పనుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడేది లేదని మంత్రి స్పష్టం చేశారు. నిర్ణయించిన గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని, పెండింగ్ బిల్లుల వివరాలను వెంటనే సమర్పించాలని సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయం ఉంటేనే అభివృద్ధి పనులు వేగంగా పూర్తవుతాయని పేర్కొన్న మంత్రి, అధికారులు పరస్పరం చర్చించుకుంటూ ముందుకు సాగాలని సూచించారు. ఎక్కడైనా సమస్యలు ఎదురైతే వెంటనే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. ప్రజా దర్బార్ ద్వారా ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని, అవసరమైన నిధులను ప్రభుత్వం మంజూరు చేస్తుందని భరోసా ఇచ్చారు. నియోజకవర్గ వ్యాప్తంగా భూముల రీ-సర్వే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పాలేరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డి, ఖమ్మం ఆర్డీవో ఎస్. శ్రీనివాస్, ఆర్ అండ్ బీ ఎస్ఈ యుగంధర్ రావు, పీఆర్ ఎస్ఈ వెంకట్ రెడ్డి, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసచారి, నియోజకవర్గ పరిధిలోని ఎంపీడీవోలు, తహసీల్దార్లు తదితర అధికారులు పాల్గొన్నారు.



## నేలకొండపల్లి మండలంలో మంత్రి పొంగులేటి విస్తృత పర్యటన.. అభివృద్ధి పనులకు శ్రీకారం

నేలకొండపల్లి, ఖమ్మం జిల్లా | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శనివారం నేలకొండపల్లి మండలంలో విస్తృతంగా పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పలు పనులకు శంకుస్థాపనలు చేయడంతో పాటు పూర్తైన అభివృద్ధి పనులను ప్రారంభించారు. పర్యటనలో భాగంగా కొరట్లగూడెం గ్రామంలో రూ.16 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను మంత్రి ప్రారంభించారు. అనంతరం నేలకొండపల్లి మండలానికి చెందిన 49 మంది లబ్ధిదారులకు మొత్తం రూ.17.13 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) చెక్కులను పంపిణీ చేశారు. కోనాయిగూడెం గ్రామంలో రూ.1.77 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అలాగే సదాశివపురం గ్రామంలో రూ.20 లక్షలతో నిర్మించిన గ్రామపంచాయతీ కార్యాలయ భవనాన్ని ప్రారంభించారు. పర్యటన సందర్భంగా అనారోగ్యంతో బాధపడుతున్న రుషికేష్ భార్యను పరామర్శించి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న మంత్రి, ఇటీవల మరణించిన స్థానిక సర్పంచ్ పాలపాటి సురేష్ సోదరుడి కుటుంబ సభ్యులను కలిసి ప్రగాఢ సానుభూతి తెలియజేసి వారికి ధైర్యం చెప్పారు. అనాసాగరం గ్రామంలో ఉప సర్పంచ్ మదార్ సాహెబ్ కుమార్తె వివాహం సందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించి పట్టు వస్త్రాలను కానుకగా అందజేశారు. అనంతరం గువ్వలగూడెం గ్రామానికి చెందిన కందుల పుల్లయ్య తల్లి మృతి చెందిన విషయం తెలుసుకుని వారి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మంత్రి వెంట స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు మెరుగుపడింది.. నాణ్యమైన వైద్య సేవలపై దృష్టి పెట్టాలి: మంత్రి దామోదర్ రాజనర్సింహ

హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల పనితీరు మెరుగుపడిందని, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతుండటంతో ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య పెరుగుతోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ తెలిపారు. హైదరాబాద్ వెంగళరావు నగర్‌లోని ఫ్యామిలీ వెల్ఫేర్ ఇన్‌స్టిట్యూట్‌లో డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని 47 ఆసుపత్రులు, తెలంగాణ వైద్య విధాన పరిషత్ కమిషనర్ పరిధిలోని 40 ఏరియా ఆసుపత్రులతో పాటు 100 పడకలు, అంతకంటే ఎక్కువ పడకలు ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల సూపరింటెండెంట్లతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వ ఆసుపత్రులపై ప్రజల్లో నమ్మకం పెరుగుతోందని, అదే సమయంలో ప్రైవేటు ఆసుపత్రులకు వచ్చే రోగుల సంఖ్య తగ్గుతున్నట్లు ఆ ఆసుపత్రుల యాజమాన్యాలు చెబుతున్నాయని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేసేందుకు వైద్యులు ఆసక్తి చూపుతున్నారని, ఇటీవల చేపట్టిన వైద్యుల నియామకాలతో ఇది స్పష్టమవుతోందన్నారు. గత రెండున్నర సంవత్సరాల్లో వైద్యులు, నర్సులు, ల్యాబ్ టెక్నీషియన్లు, పారామెడికల్ సిబ్బంది సహా సుమారు 14 వేల పోస్టులు భర్తీ చేశామని, అవసరమైన చోట్ల నియామకాలు కొనసాగుతున్నాయని వెల్లడించారు. అద్దె భవనాలు, పాత భవనాలు, ఇరుకైన భవనాల్లో కొనసాగుతున్న ఆసుపత్రుల స్థానంలో కొత్త భవనాల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, అవసరమైన మందులు, సర్జికల్స్, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు. ప్రభుత్వం అన్ని వనరులు కల్పిస్తున్న నేపథ్యంలో వైద్య సేవల నాణ్యతలో లోపాలకు ఎలాంటి కారణాలు చెప్పొద్దని సూపరింటెండెంట్లను మంత్రి ఆదేశించారు. ప్రతి సూపరింటెండెంట్ తమ ఆసుపత్రిని సొంత బాధ్యతగా భావించి, రోగి ఆసుపత్రిలో చేరినప్పటి నుంచి డిశ్చార్జ్ అయ్యే వరకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందేలా వ్యవస్థను రూపొందించాలని సూచించారు. ప్రతిరోజూ వార్డులను సందర్శించి రోగులతో మాట్లాడాలని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఆసుపత్రుల్లో పరిశుభ్రత, తాగునీరు, మరుగుదొడ్లు, భోజన నాణ్యత, భద్రత, పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. డాక్టర్లు, నర్సులు, సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం, అనవసర గైర్హాజరు, రోగులకు చికిత్సలో ఆలస్యం వంటి అంశాలను సహించేది లేదని హెచ్చరించారు. అత్యవసర విభాగాలు, ఐసీయూలు, ప్రసూతి విభాగాలు, ఆపరేషన్ థియేటర్లు, డయాలసిస్ యూనిట్లు, ల్యాబ్‌లు, బ్లడ్ బ్యాంకులు, రేడియాలజీ సేవలు 24 గంటలు సమర్థవంతంగా పనిచేసేలా పర్యవేక్షణ ఉండాలని సూచించారు. ఆధునిక వైద్య పరికరాలు వినియోగంలో ఉండేలా చూడాలని, పనిచేయని పరికరాలను వెంటనే మరమ్మతు చేయించాలని, మందుల కొరత లేదా మౌలిక సదుపాయాల సమస్యలు ఉంటే ఉన్నతాధికారులకు వెంటనే సమాచారం అందించాలని ఆదేశించారు. ఆసుపత్రుల పనితీరును ఇకపై నిరంతరం సమీక్షించేందుకు డ్యాష్‌బోర్డు ఏర్పాటు చేస్తున్నామని మంత్రి తెలిపారు. ఓపీ, ఐపీ సేవలు, శస్త్రచికిత్సలు, అత్యవసర సేవలు, మాతా-శిశు ఆరోగ్య సేవలు, రోగుల సంతృప్తి, పరిశుభ్రత, సేవల నాణ్యత వంటి అంశాల ఆధారంగా ఆసుపత్రుల పనితీరును అంచనా వేస్తామని పేర్కొన్నారు. ఉత్తమ సేవలు అందించే వైద్యులు, సిబ్బందిని ప్రోత్సహిస్తామని, నిర్లక్ష్యం వహించే వారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో IIHF గవర్నింగ్ కౌన్సిల్ చైర్‌పర్సన్ డాక్టర్ కవిత రెడ్డి, వైద్య ఆరోగ్య శాఖ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి డాక్టర్ క్రిస్టినా జడ్ చొంగ్తు, TGMSIDC ఎండీ డాక్టర్ గౌరవ్ ఉప్పల్, రాజీవ్ ఆరోగ్యశ్రీ హెల్త్ కేర్ ట్రస్ట్ సీఈవో హనుమంతు, డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్ డాక్టర్ నరేంద్ర కుమార్, డైరెక్టర్ పబ్లిక్ హెల్త్ డాక్టర్ రవీందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## విక్రమ్-1 ప్రయోగం విజయవంతం.. ఇస్రో, స్కైరూట్ ఏరోస్పేస్ బృందాలకు మంత్రి దామోదర్ రాజనర్సింహ అభినందనలు



హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: విక్రమ్-1 ప్రయోగాన్ని విజయవంతంగా నిర్వహించిన ఇస్రో (ISRO), స్కైరూట్ ఏరోస్పేస్ (Skyroot Aerospace) బృందాలకు తెలంగాణ ఆరోగ్య, వైద్య & కుటుంబ సంక్షేమ, శాస్త్ర సాంకేతిక శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ హృదయపూర్వక అభినందనలు తెలిపారు. ఈ విజయవంతమైన ప్రయోగం భారత అంతరిక్ష ప్రయాణంలో మరో చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందని మంత్రి పేర్కొన్నారు. దేశంలోని శాస్త్ర, సాంకేతిక, ఆవిష్కరణ రంగాల అభివృద్ధికి ఈ విజయం నిదర్శనమని తెలిపారు. ముఖ్యంగా హైదరాబాద్‌కు చెందిన స్కైరూట్ ఏరోస్పేస్ సంస్థ ఈ ప్రతిష్ఠాత్మక మిషన్‌లో భాగస్వామ్యం కావడం తెలంగాణకు గర్వకారణమని అన్నారు. విక్రమ్-1 ప్రయోగ విజయానికి కృషి చేసిన శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, సాంకేతిక నిపుణులందరికీ మంత్రి అభినందనలు తెలిపారు. భారతదేశం అంతరిక్ష పరిశోధన రంగంలో మరిన్ని విజయాలు సాధిస్తూ ప్రపంచ స్థాయిలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.



## స్వచ్ఛాంధ్రలో భాగంగా రూ.15,274 కోట్ల మౌలిక వసతుల పనులకు శ్రీకారం: సీఎం చంద్రబాబు

గుడివాడ | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా రాష్ట్రంలోని 120 పట్టణాల పరిధిలో రూ.15,274 కోట్ల విలువైన ప్రజారోగ్య, మున్సిపల్ మౌలిక వసతుల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. గుడివాడలో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ, పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, ప్రజారోగ్య పరిరక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలోని 8 ప్రాంతాల్లో ఇంటిగ్రేటెడ్ సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్లను ప్రారంభించామని తెలిపారు. ఆపరేషన్ క్లీన్ స్వీప్ కార్యక్రమంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన 3 కార్పొరేషన్లు, 6 మున్సిపాలిటీలకు అవార్డులు అందించి ప్రోత్సహించినట్లు వెల్లడించారు. రాబోయే రోజుల్లో కొత్తగా 6 వేస్ట్ టు ఎనర్జీ ప్లాంట్లను ప్రారంభించి, డంపింగ్ యార్డుల అవసరం లేకుండా చేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని సీఎం తెలిపారు. పరిశుభ్రమైన పరిసరాలు, స్వచ్ఛమైన ప్రాంతాల నిర్మాణంలో ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రజల సహకారం ఎంతో అవసరమని ఆయన అన్నారు. స్వచ్ఛాంధ్ర ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు పిలుపునిచ్చారు.

## చెన్నమ్మ గారి మృతి పట్ల సీఎం చంద్రబాబు సంతాపం.. దేవేగౌడ కుటుంబానికి పరామర్శ



అమరావతి | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: శ్రీమతి చెన్నమ్మ గారి మృతి వార్త తనను తీవ్రంగా కలచివేసిందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. ఆమె మృతిపట్ల ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేసిన సీఎం, మాజీ ప్రధాని హెచ్.డి. దేవేగౌడ, కేంద్ర మంత్రి హెచ్.డి. కుమారస్వామి, వారి కుటుంబ సభ్యులకు హృదయపూర్వక సానుభూతి తెలియజేశారు. చెన్నమ్మ గారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థిస్తున్నానని, ఈ విషాద సమయంలో కుటుంబ సభ్యులకు భగవంతుడు ధైర్యం, మనోబలం ప్రసాదించాలని ఆకాంక్షించారు. కుటుంబానికి కలిగిన అపార నష్టాన్ని తట్టుకునే శక్తిని భగవంతుడు ఇవ్వాలని సీఎం చంద్రబాబు నాయుడు కోరారు.

## అమృత్ భారత్ పథకంతో మంగళగిరి రైల్వేస్టేషన్ ఆధునీకరణ.. రూ.12.56 కోట్ల అభివృద్ధి పనులు ప్రారంభం




మంగళగిరి, గుంటూరు జిల్లా | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: 'అమృత్ భారత్ స్టేషన్ పథకం' కింద రూ.12.56 కోట్ల వ్యయంతో ఆధునీకరించిన మంగళగిరి రైల్వేస్టేషన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్‌తో కలిసి పాల్గొని శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం చంద్రబాబు మాట్లాడుతూ దేశ అభివృద్ధిలో రైల్వే వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. రైల్వేస్టేషన్ల అభివృద్ధి ద్వారా స్థానికంగా ఆర్థిక కార్యకలాపాలు పెరిగి ప్రజలకు మరిన్ని అవకాశాలు లభిస్తాయని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను దక్షిణ భారతదేశంలో నంబర్-1 రాష్ట్రంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. మంగళగిరి ప్రాంతానికి పరిశ్రమలను తీసుకువచ్చి యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఆధునీకరించిన రైల్వేస్టేషన్ ద్వారా ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి వస్తాయని, అభివృద్ధి కార్యక్రమాలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## విక్రమ్-1 విజయంపై నారా లోకేష్ హర్షం.. స్కైరూట్ ఏరోస్పేస్ బృందానికి అభినందనలు





అమరావతి | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: విక్రమ్-1 రాకెట్ ప్రయోగం విజయవంతం కావడంపై రాష్ట్ర విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ హర్షం వ్యక్తం చేశారు. స్కైరూట్ ఏరోస్పేస్ బృందం సాధించిన ఈ ఘనత భారత అంతరిక్ష రంగంలో ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు. స్కైరూట్ సంస్థతో తనకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్న మంత్రి, సంస్థ ప్రతినిధులతో విశాఖపట్నంలో జరిగిన తొలి సమావేశంలోనే వారి లక్ష్యం, అంతరిక్ష రంగంలో భారత భవిష్యత్తును నిర్మించాలనే దృక్పథం స్పష్టంగా కనిపించిందన్నారు. ఆంధ్రప్రదేశ్ కూడా ఈ అంతరిక్ష ప్రయాణంలో భాగస్వామి కావాలనే ఉద్దేశంతో స్కైరూట్ ప్రతిపాదనలను ప్రోత్సహించి, స్టార్టప్‌లకు అనుకూలమైన విధానాలను రూపొందించామని తెలిపారు. తిరుపతిలో 'స్పేస్ సిటీ' ఏర్పాటు ద్వారా స్కైరూట్ వంటి అంతరిక్ష సంస్థలకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు. విక్రమ్-1 తొలి ప్రయోగంలోనే కక్ష్యలోకి చేరడం ఎంతో గర్వకారణమని, ఈ విజయం భారత యువ శాస్త్రవేత్తలు, ఇంజినీర్లు, ఆవిష్కర్తల ప్రతిభకు నిదర్శనమని నారా లోకేష్ పేర్కొన్నారు. స్కైరూట్ ఏరోస్పేస్ బృందానికి అభినందనలు తెలిపిన ఆయన, ఇది కేవలం ఆరంభం మాత్రమేనని, భవిష్యత్తులో మరిన్ని అంతరిక్ష విజయాలకు ఆంధ్రప్రదేశ్ సహకారం కొనసాగుతుందని తెలిపారు.

# ఉక్రెయిన్ డ్రోన్ దాడుల్లో రష్యాలో ఏడుగురు మృతి.. 51 మందికి గాయాలు



మాస్కో, రష్యా | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: రష్యాపై శనివారం తెల్లవారుజామున ఉక్రెయిన్ చేపట్టిన డ్రోన్ దాడుల్లో ఏడుగురు మృతి చెందగా, 51 మంది గాయపడినట్లు సమాచారం. ఈ దాడుల్లో గోదాములు, చమురు నిల్వ కేంద్రం, నివాస భవనాలు లక్ష్యంగా మారినట్లు అధికారులు వెల్లడించారు. మాస్కో, టాంబోవ్ ప్రాంతాల్లోని కీలక లాజిస్టిక్ కేంద్రాలపై దాడులు నిర్వహించినట్లు ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్స్కీ తెలిపారు. డ్రోన్లు, నావిగేషన్ పరికరాల తయారీకి అవసరమైన ఆంక్షలు ఎదుర్కొంటున్న విడిభాగాలను సరఫరా చేసేందుకు ఈ కేంద్రాలను వినియోగిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. మరోవైపు ఈ దాడుల నేపథ్యంలో రష్యా భద్రతా వ్యవస్థలు అప్రమత్తమయ్యాయి. దాడుల వల్ల జరిగిన నష్టం, సహాయక చర్యలపై అధికారులు వివరాలు సేకరిస్తున్నారు.



# నరసరావుపేటలో సీఎం చంద్రబాబు, కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్‌కు ఘన స్వాగతం పలికిన పల్నాడు ఇన్‌చార్జ్ ఎస్పీ

నరసరావుపేట, పల్నాడు జిల్లా | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: రుణమేళా కార్యక్రమం నిమిత్తం పల్నాడు జిల్లా నరసరావుపేట పట్టణానికి విచ్చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌లకు పల్నాడు జిల్లా ఇన్‌చార్జ్ ఎస్పీ (బాపట్ల జిల్లా ఎస్పీ) శ్రీ బి. ఉమామహేశ్వర్, ఐపీఎస్ మర్యాదపూర్వకంగా కలిసి ఘన స్వాగతం పలికారు. శుక్రవారం నరసరావుపేటలోని హెలిప్యాడ్ వద్దకు చేరుకున్న ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రికి పోలీసు అధికారులు, సిబ్బంది ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా పోలీసు యంత్రాంగం తరఫున ఇన్‌చార్జ్ ఎస్పీ ఉమామహేశ్వర్ వారిని కలిసి పుష్పగుచ్ఛం అందించి స్వాగతం తెలిపారు. ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి పర్యటన సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.



# గుంటూరులో మహిళపై దాడి ఘటనపై ఏపీ మహిళా కమిషన్ ఆరా.. నిందితులపై కఠిన చర్యలకు సూచన

గుంటూరు | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: గుంటూరు నగరంలో మహిళపై జరిగిన దాడి ఘటనను ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ సీరియస్‌గా తీసుకుంది. ఘటనపై పూర్తి వివరాలను తెలుసుకునేందుకు మహిళా కమిషన్ అధికారులు ఆరా తీస్తున్నారు. బాధిత మహిళకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని మహిళా కమిషన్ చైర్‌పర్సన్ డాక్టర్ రాయపాటి శైలజ సూచించారు. మహిళల గౌరవం, భద్రతకు భంగం కలిగించే ఇలాంటి ఘటనలను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని పేర్కొన్నారు. ఘటనకు సంబంధించి విచారణ వేగవంతం చేసి, నిందితులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. బాధితురాలికి అవసరమైన సహాయం, రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. మహిళలపై జరుగుతున్న అన్యాయాలను అరికట్టేందుకు మహిళా కమిషన్ నిరంతరం పర్యవేక్షిస్తుందని డాక్టర్ రాయపాటి శైలజ తెలిపారు.



# పార్లమెంట్ చర్చల్లో 'నేషన్ ఫస్ట్' భావన ప్రతిఫలించాలి.. జనసేన ఎంపీలకు పవన్ కళ్యాణ్ దిశానిర్దేశం

హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: పార్లమెంట్ చర్చల్లో జాతీయ దృక్పథంతో పాటు రాష్ట్ర ప్రయోజనాలు ప్రతిఫలించేలా వ్యవహరించాలని జనసేన పార్టీ అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పార్టీ ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల నేపథ్యంలో శనివారం హైదరాబాద్‌లో జనసేన పార్టీ ఎంపీలతో నిర్వహించిన సమావేశంలో రానున్న సమావేశాల్లో చర్చకు రానున్న బిల్లులు, పార్టీ వైఖరి, అనుసరించాల్సిన వ్యూహాలపై పవన్ కళ్యాణ్ సమగ్రంగా చర్చించారు. 'నేషన్ ఫస్ట్' అనే భావనతో దేశ ప్రయోజనాలను కాపాడుతూ, ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి అవసరమైన అంశాలను పార్లమెంట్ వేదికగా బలంగా వినిపించాలని సూచించారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీలకు తెలిపారు. ముఖ్యంగా రైల్వే ప్రాజెక్టుల పురోగతి, కొత్త రైల్వే లైన్ల నిర్మాణం, రైల్వే ఓవర్ బ్రిడ్జిల ఏర్పాటు, దక్షిణ కోస్తా రైల్వే జోన్ అభివృద్ధి వంటి అంశాలపై సమగ్ర అవగాహనతో కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు. వర్షాకాల సమావేశాల్లో నియోజకవర్గాల పునర్విభజన, మహిళా రిజర్వేషన్ల అమలు వంటి కీలక అంశాలపై పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలను వివరించారు. ప్రజల ఆకాంక్షలు, జాతీయ ప్రయోజనాలు, రాష్ట్ర అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిర్మాణాత్మక చర్చల్లో పాల్గొనాలని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. దేశ ప్రయోజనాలు, రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే జనసేన పార్టీ లక్ష్యమని, ఈ దిశగా పార్లమెంట్‌లో ఎంపీలు చురుకైన పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. ఈ సమావేశంలో లోక్‌సభ సభ్యులు వల్లభనేని బాలశౌరి, తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, రాజ్యసభ సభ్యులు లింగమనేని రమేష్ పాల్గొన్నారు.

# ఏపీ, తెలంగాణలో ఆరు రోజుల పాటు వర్షాలు.. ఈదురుగాలులకు అవకాశం: IMD హెచ్చరిక

హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం బలపడటంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో జూలై 23 వరకు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (India Meteorological Department - IMD) వెల్లడించింది. కోస్తాంధ్ర, యానాం, రాయలసీమ, తెలంగాణ ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని, కొన్ని ప్రాంతాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. గంటకు 50 నుంచి 70 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. సముద్ర పరిస్థితులు ప్రతికూలంగా మారడంతో జూలై 21 వరకు మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లవద్దని సూచించింది. తీర ప్రాంతాల్లో అలలు ఉద్ధృతంగా ఉండే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని IMD సూచించింది. అధికారులు వాతావరణ పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు అవసరమైన సమాచారం అందించాలని పేర్కొన్నారు.

# నల్గొండ టూ టౌన్ సీఐగా ఆదిరెడ్డి బాధ్యతలు స్వీకరణ.. రౌడీషీటర్లు, గంజాయి ముఠాలపై ప్రత్యేక నిఘా




నల్గొండ | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: నల్గొండ టూ టౌన్ పోలీస్ స్టేషన్ నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా ఆదిరెడ్డి బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈ స్టేషన్‌లో విధులు నిర్వహించిన సీఐ రాఘవరావు హాలియాకు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఆదిరెడ్డిని నియమించారు. నల్గొండ జిల్లాలో గతంలో విధులు నిర్వహించిన అనుభవం కలిగిన సీఐ ఆదిరెడ్డి పలు కీలక కేసులను విజయవంతంగా ఛేదించి సమర్థ అధికారిగా గుర్తింపు పొందారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం పోలీస్ సిబ్బందితో సమావేశం నిర్వహించిన ఆయన, శాంతిభద్రతల పరిరక్షణకు మరింత సమర్థవంతమైన పోలీసింగ్ అమలు చేయాలని సూచించారు. టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లు, గంజాయి ముఠాలు, సంఘవిద్రోహ శక్తులు, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తామని, నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్, డీఎస్పీ శివరాం రెడ్డి ఆదేశాల మేరకు నేర నియంత్రణకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నట్లు సీఐ ఆదిరెడ్డి తెలిపారు. ప్రజల భద్రతకు భంగం కలిగించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని స్పష్టం చేశారు. అనుమానాస్పద కార్యకలాపాలు, నేరాలకు సంబంధించిన సమాచారాన్ని ప్రజలు ధైర్యంగా పోలీసులకు అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. నూతన సీఐగా ఆదిరెడ్డి బాధ్యతలు చేపట్టడంతో నల్గొండ టూ టౌన్ పరిధిలో నేర నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణ మరింత బలోపేతం అవుతుందని స్థానికులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



# ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌ను పరామర్శించిన మంత్రి నారా లోకేష్.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష

హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: కుడి భుజానికి శస్త్రచికిత్స చేయించుకున్న ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ను రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. శనివారం సాయంత్రం హైదరాబాద్‌లోని పవన్ కళ్యాణ్ నివాసానికి వెళ్లిన మంత్రి లోకేష్, విజయవాడ కనకదుర్గమ్మ చిత్రపటం, ప్రసాదాన్ని అందించి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న ఆయన, భుజానికి అయిన గాయం, శస్త్రచికిత్సకు సంబంధించిన వివరాలను తెలుసుకున్నారు. వైద్యుల సూచనలు తప్పకుండా పాటిస్తూ విశ్రాంతి తీసుకోవాలని మంత్రి నారా లోకేష్ కోరారు. పవన్ కళ్యాణ్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవలోకి తిరిగి రావాలని ఆకాంక్షించారు.




## పుష్ప-2కు జాతీయ స్థాయి గుర్తింపు.. సుకుమార్‌కు బెస్ట్ స్క్రీన్‌ప్లే రైటర్ అవార్డు

హైదరాబాద్ | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: తెలుగు సినిమా పరిశ్రమకు మరోసారి జాతీయ స్థాయిలో గౌరవం దక్కింది. ప్రముఖ దర్శకుడు సుకుమార్ తెరకెక్కించిన "పుష్ప-2: ది రూల్" చిత్రానికి ప్రతిష్ఠాత్మక అవార్డుల్లో భాగంగా బెస్ట్ స్క్రీన్‌ప్లే రైటర్ అవార్డు లభించింది. ఈ చిత్రానికి సంబంధించి బెస్ట్ కాస్ట్యూమ్ డిజైనర్ అవార్డు కూడా దక్కగా, కాస్ట్యూమ్ డిజైనర్లు దీపాలే నూర్, శీతల్ శర్మలు ఈ పురస్కారాన్ని అందుకున్నారు. అలాగే "లక్కీ భాస్కర్" చిత్రానికి బెస్ట్ స్క్రీన్‌ప్లే డైలాగ్ రైటర్ అవార్డు దర్శకుడు వెంకీ అట్లూరికి లభించింది. "కమిటీ కుర్రోళ్ళు" చిత్రానికి బెస్ట్ తెలుగు ఫిలిం అవార్డు దక్కగా, దర్శకుడు యదు వంశీ గుర్తింపు పొందారు. అదే చిత్రానికి బెస్ట్ మేకప్ అవార్డు మేకప్ ఆర్టిస్ట్ రవికుమార్‌కు లభించింది. "చిన్న కథ కాదు" చిత్రానికి బెస్ట్ చిల్డ్రన్స్ ఫిలిం అవార్డు దక్కగా, దర్శకుడు నందకిషోర్ ఈమని, చైల్డ్ ఆర్టిస్ట్ అరుణ్ దేవ్ పోతుల అవార్డులు అందుకున్నారు. "కల్కి 2898 ఏడీ" చిత్రానికి బెస్ట్ పాపులర్ ఫిలిం అవార్డు లభించగా, దర్శకుడు నాగ్ అశ్విన్‌కు గుర్తింపు దక్కింది. ఇదే చిత్రానికి బెస్ట్ ప్రొడక్షన్ డిజైనర్ అవార్డు నితిన్ జీహాన్ చౌదరికి లభించింది. తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన పలు సినిమాలు వివిధ విభాగాల్లో అవార్డులు సాధించడం పట్ల సినీ ప్రముఖులు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రకటన.. 'పుష్ప-2', 'కల్కి 2898 ఏడీ' సహా తెలుగు సినిమాలకు గుర్తింపు

న్యూఢిల్లీ | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: 72వ జాతీయ చలనచిత్ర అవార్డుల జాబితా విడుదలైంది. దేశవ్యాప్తంగా వివిధ భాషల చిత్రాలు, కళాకారులు, సాంకేతిక నిపుణులు ప్రతిష్ఠాత్మక పురస్కారాలను అందుకున్నారు. తెలుగు చిత్ర పరిశ్రమకు చెందిన పలు సినిమాలు ఈసారి జాతీయ స్థాయిలో సత్తా చాటాయి. 'ఆర్టికల్ 370' ఉత్తమ చిత్రంగా ఎంపిక కాగా, ఉత్తమ నటుడి అవార్డును కార్తీక్ ఆర్యన్ (చందూ ఛాంపియన్), మమ్ముట్టి (భ్రమయుగం) సంయుక్తంగా అందుకున్నారు. ఉత్తమ నటిగా యామీ గౌతమ్ (ఆర్టికల్ 370) ఎంపికయ్యారు. ఉత్తమ దర్శకుడిగా రాజ్‌కుమార్ పెరియసామి (అమరన్) అవార్డు దక్కించుకున్నారు. ఉత్తమ ప్రజాదరణ పొందిన చిత్రంగా 'కల్కి 2898 ఏడీ' ఎంపికైంది. సాంకేతిక విభాగాల్లో 'పుష్ప-2' చిత్రానికి సుకుమార్ ఉత్తమ స్క్రీన్‌ప్లే రైటర్ అవార్డు, 'లక్కీ భాస్కర్' చిత్రానికి వెంకీ అట్లూరి ఉత్తమ డైలాగ్ రైటర్ అవార్డు అందుకున్నారు. 'కల్కి 2898 ఏడీ' చిత్రానికి ఉత్తమ ప్రొడక్షన్ డిజైన్ అవార్డు లభించగా, 'కమిటీ కుర్రాళ్లు' చిత్రానికి ఉత్తమ మేకప్ ఆర్టిస్ట్ అవార్డు దక్కింది. 'పుష్ప-2' చిత్రానికి దీపాలి నూర్, షీతల్ శర్మలు ఉత్తమ కాస్ట్యూమ్ డిజైన్ అవార్డును అందుకున్నారు. ప్రాంతీయ చిత్రాల విభాగంలో తెలుగు ఉత్తమ చిత్రంగా 'కమిటీ కుర్రాళ్లు' ఎంపికైంది. హిందీ విభాగంలో 'శ్రీకాంత్', తమిళంలో 'రాయన్', మలయాళంలో 'ఫెమినిచి ఫాతిమా', కన్నడలో 'మిథ్యా' చిత్రాలు గుర్తింపు పొందాయి. నాన్-ఫీచర్ విభాగంలో కూడా పలు చిత్రాలు, డాక్యుమెంటరీలు, షార్ట్ ఫిల్మ్‌లు అవార్డులు సాధించాయి. 'రామ్-నామీ' ఉత్తమ డాక్యుమెంటరీగా ఎంపిక కాగా, 'టచ్ యాజ్ వాటర్' ఉత్తమ యానిమేషన్ చిత్రంగా నిలిచింది. సినీ రంగంలోని ప్రతిభావంతులైన నటులు, దర్శకులు, సాంకేతిక నిపుణులకు అవార్డులు దక్కడంపై సినీ వర్గాలు హర్షం వ్యక్తం చేశాయి. 'మీయళగన్' చిత్రానికి సౌండ్ మిక్స్ ఇంజినీర్ సురెన్ జీకి ప్రత్యేక గుర్తింపు లభించింది.



## ఎల్‌నినో పరిస్థితులను ఎదుర్కొనేందుకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేయాలి: సీఎస్ సంజయ్ జాజు

సూర్యాపేట | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: ఎల్‌నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాలు ఉన్న నేపథ్యంలో అధికారులు ముందస్తు కార్యాచరణ ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఆదేశించారు. సూపర్ ఎల్‌నినో పరిస్థితులు, వర్షాభావ నివారణ చర్యలు, వ్యవసాయ ప్రణాళికలపై శనివారం హైదరాబాద్ నుంచి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సూర్యాపేట సమీకృత జిల్లా కలెక్టరేట్ (ఐడీఓసీ) నుంచి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎస్ సంజయ్ జాజు మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులకు విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, పంటల మార్పిడి విధానాలను ప్రోత్సహించాలని, తక్కువ నీటి అవసరం ఉన్న ప్రత్యామ్నాయ పంటల సాగుపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. రైతులకు అవసరమైన విత్తనాలు, సాంకేతిక సలహాలు అందుబాటులో ఉంచి సాగు విస్తీర్ణం పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రులు, ప్రత్యేక అధికారులతో నిర్వహించే సమీక్ష సమావేశాలకు అన్ని శాఖల అధికారులు వర్షపాతం పరిస్థితులు, వ్యవసాయం, తాగునీటి లభ్యత, శాఖల వారీ కార్యాచరణ ప్రణాళికలపై సమగ్ర నివేదికలతో హాజరు కావాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ జూలై 20న ఉమ్మడి నల్గొండ జిల్లా స్థాయిలో నిర్వహించే ఇన్‌చార్జి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఉన్నతాధికారుల సమావేశానికి సంబంధిత శాఖల అధికారులు పూర్తి సమాచారంతో సిద్ధంగా రావాలని ఆదేశించారు. పీపీటీ, ప్రింట్ అవుట్, పెన్ డ్రైవ్ తదితర రూపాల్లో అవసరమైన సమాచారాన్ని అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ బి. హరి సింగ్, జడ్పీ సీఈఓ శిరీష, డీఆర్‌డీఓ పీడీ సన్యాసయ్య, డీపీఓ యాదగిరి, డీఎంహెచ్ఓ వెంకటరమణ, జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

## బయటి ఆహారంతోనే నర్సింగ్ విద్యార్థుల అస్వస్థత: డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, జులై 19, 2026: బయట నుండి తెచ్చుకున్న ఆహారం తినడం వల్లే సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో ఎనిమిది మంది విద్యార్థులు స్వల్ప అస్వస్థతకు గురైనట్లు జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి (డీఎంహెచ్ఓ) డాక్టర్ వెంకటరమణ ఒక ప్రకటనలో తెలిపారు. అస్వస్థతకు గురైన విద్యార్థులను వెంటనే సూర్యాపేట ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స అందిస్తున్నామని, వారిలో ముగ్గురు విరోచనాలతో, మరో ముగ్గురు జ్వరంతో బాధపడుతున్నారని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం విద్యార్థులందరి ఆరోగ్యం నిలకడగా ఉందని, నిపుణులైన వైద్యుల బృందం వారిని నిరంతరం పర్యవేక్షిస్తోందని స్పష్టం చేశారు. విషయం తెలిసిన వెంటనే డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణ తన బృందంతో కలిసి కళాశాలలో క్షేత్రస్థాయి విచారణ చేపట్టారు. విద్యార్థుల ఆహారపు అలవాట్లు, హాస్టల్ వసతులను పరిశీలించగా, వారు బయటి నుండి తెచ్చుకున్న ఆహారాన్ని తీసుకోవడం వల్లే ఈ సమస్య తలెత్తినట్లు ప్రాథమిక విచారణలో నిర్ధారణ అయిందని వెల్లడించారు. వర్షాకాలం దృష్ట్యా విద్యార్థులు బయటి ఆహారం, కలుషిత నీటి విషయంలో అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. కళాశాల మరియు హాస్టల్ ప్రాంగణాల్లో పారిశుద్ధ్య ప్రమాణాలను నిశితంగా పరిశీలిస్తున్నామని, విద్యార్థుల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని డీఎంహెచ్ఓ స్పష్టం చేశారు.

## జూలై 20న ప్రజావాణి కార్యక్రమం రద్దు: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, జులై 19, 2026: ఈ నెల 20వ తేదీ సోమవారం నాడు జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన ఉమ్మడి జిల్లా స్థాయిలో ఎల్‌నినో ప్రభావం, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, వర్షపాతం, పంటల సాగు, గ్రౌండ్ వాటర్, విద్యుత్, తాగు నీటి సరఫరా, సీజనల్ వ్యాధుల నివారణ మరియు నియంత్రణ చర్యలు తదితర కీలక అంశాలపై జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమీక్ష సమావేశం నిర్వహించనున్న నేపథ్యంలో, అదే రోజు నిర్వహించాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి సోమవారం నుంచి ప్రజావాణి కార్యక్రమం యథావిధిగా నిర్వహించబడుతుందని ఆయన స్పష్టం చేశారు. కావున అర్జీదారులు, ప్రజలు ఈ విషయాన్ని గమనించి, జిల్లా యంత్రాంగానికి సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.



## అర్ధరాత్రి పిలుపుకు స్పందించిన వైద్యురాలు.. తెల్లవారేసరికి పండంటి ఆడబిడ్డ జననం

ఆత్మకూరు (ఎస్), సూర్యాపేట జిల్లా | సందేశం టైమ్స్ ప్రతినిధి | 19 జూలై: అత్యవసర సమయంలో తక్షణమే స్పందించి ఓ గర్భిణీకి సకాలంలో వైద్య సేవలు అందించి తల్లి, శిశువు ప్రాణాలను కాపాడిన ఆత్మకూరు (ఎస్) ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (PHC) వైద్యురాలు డాక్టర్ రమ్యపై ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున గర్భిణీ మహిళ పరిస్థితిపై ఆమె బంధువుల నుంచి అర్ధరాత్రి 2 గంటల సమయంలో ఫోన్ కాల్ రావడంతో డాక్టర్ రమ్య వెంటనే స్పందించారు. పరిస్థితిని అర్థం చేసుకుని ఆసుపత్రి సిబ్బందిని అప్రమత్తం చేసి, గర్భిణీ ఆసుపత్రికి చేరుకునేలోపే ప్రసవానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు సిద్ధం చేయించారు. వైద్యురాలు, సిబ్బంది సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో తెల్లవారుజామున 5:15 గంటలకు సదరు మహిళ పండంటి ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లి, నవజాత శిశువు ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈ ప్రసవ ప్రక్రియలో నర్సింగ్ ఆఫీసర్ మానస, ఏఎన్ఎంలు లక్ష్మి, సుజాత, ఆశా కార్యకర్త సుజాతలు కీలక పాత్ర పోషించారు. విధి నిర్వహణలో భాగంగానే కాకుండా అత్యవసర వేళల్లోనూ రోగుల పిలుపునకు స్పందిస్తూ సేవలు అందిస్తున్న డాక్టర్ రమ్య, ఆమె బృందాన్ని స్థానిక ప్రజలు, రోగుల బంధువులు అభినందిస్తున్నారు.

## మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందించాలి: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్



హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, జులై 19, 2026: జిల్లాలో మహిళల్లో రొమ్ము క్యాన్సర్ (Breast Cancer) కేసులను ప్రారంభ దశలోనే గుర్తించి, అనుమానితులను సకాలంలో వైద్య పరీక్షలు, చికిత్స కోసం రిఫర్ చేసే విధంగా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టర్ అధ్యక్షతన SERP శాఖ, యునో బ్రెస్ట్ ఫౌండేషన్, గ్రాన్యూల్స్ ఇండియా సంస్థల సమన్వయంతో రొమ్ము క్యాన్సర్ గుర్తింపు, ముందస్తు నిర్ధారణ కార్యక్రమాల అమలుపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మహిళల్లో రొమ్ము క్యాన్సర్‌పై విస్తృత అవగాహన కల్పించడం, గ్రామ స్థాయిలో స్క్రీనింగ్ కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించడం, అనుమానిత కేసులను వెంటనే ఉన్నత వైద్య కేంద్రాలకు రిఫర్ చేసే వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు. వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స విజయవంతం అయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని, జిల్లాలో ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణాభివృద్ధి శాఖ, SERP తో పాటు సంబంధిత అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు. గ్రామీణ ప్రాంత మహిళలకు రొమ్ము క్యాన్సర్ లక్షణాలు, ముందస్తు పరీక్షల అవసరంపై విస్తృత ప్రచారం నిర్వహించి, ఎక్కువ మంది మహిళలు స్క్రీనింగ్‌లో పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని, క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు, స్క్రీనింగ్ శిబిరాల నిర్వహణలో ఆయా సంస్థలకు అధికారులు పూర్తి సహకారం అందించాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జ్యోతి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ లలితా దేవి, డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యాధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి నీటి బొట్టును భూమిలోకి ఇంకించాలి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, జులై 19, 2026: జిల్లాలో భూగర్భ జలాలను పెంపొందించడంతో పాటు రైతులకు దీర్ఘకాలిక సాగునీటి వనరులు అందుబాటులోకి తీసుకురావాలంటే వర్షపు నీటి సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రతి నీటి బొట్టును ఒడిసిపట్టి భూమిలోకి ఇంకించేలా వాటర్‌షెడ్ కార్యక్రమాలను వేగవంతం చేయాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అధికారులను ఆదేశించారు. శనివారం కోహీర్ మండలంలోని సజ్జాపూర్, ఖానాపూర్, బడంపేట గ్రామాల్లో పీఎంకేఎస్‌వై పథకం కింద చేపడుతున్న వాటర్‌షెడ్ అభివృద్ధి పనులు, రీఛార్జ్ బోర్‌వెల్ స్ట్రక్చర్లు, పర్‌కొలేషన్ ట్యాంకులు, మినీ పర్‌కొలేషన్ ట్యాంకులు తదితర వర్షపు నీటి సంరక్షణ నిర్మాణాలను జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల నాణ్యత, నిర్మాణాల సామర్థ్యంపై అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రతి గ్రామపంచాయతీలో కనీసం ఆరు ఫామ్‌పాండ్లు ఏర్పాటు చేయాలని, ప్రతి రైతు తన వ్యవసాయ భూమిలో ఊట కుంట లేదా పంటకుంట ఏర్పాటు చేసుకునేలా అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కుంటల్లో వర్షపు నీరు నిల్వ ఉండటం వల్ల భూగర్భ జలాలు పునరుద్ధరించబడటంతో పాటు అవసరమైన సమయంలో పంటలకు రక్షణాత్మక సాగునీరు అందుతుందని, ముఖ్యంగా హార్టికల్చర్ పంటల విస్తరణకు, ఆరుతడి పంటల సాగుకు అనుకూల పరిస్థితులు ఏర్పడతాయని తెలిపారు. ఇదే తరహా వాటర్‌షెడ్ అభివృద్ధి పనులను నారాయణఖేడ్, ఆందోల్, జహీరాబాద్ నియోజకవర్గాల్లో కూడా విస్తృతంగా చేపట్టాలని ఆదేశించారు. ఈ సందర్శనలో కలెక్టర్ వెంట డీఆర్‌డీఓ (పీడీ) జ్యోతి, సంబంధిత శాఖల అధికారులు, ఎంపీడీవోలు, సాంకేతిక సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి మెదక్ జిల్లా ఎల్‌నినో సమీక్షకు సర్వం సిద్ధం చేయాలి: జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్





హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, జులై 19, 2026: ఉమ్మడి మెదక్ జిల్లాలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన వర్షాభావ పరిస్థితులపై ఈ నెల 20న జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన నిర్వహించనున్న సమీక్ష సమావేశానికి అన్ని శాఖల అధికారులు పూర్తి సమాచారంతో, నివేదికలతో సిద్ధంగా ఉండాలని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఆదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అన్ని జిల్లాల కలెక్టర్లు, ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సూచనల మేరకు ఈ నెల 20న ఉమ్మడి జిల్లా స్థాయిలో జరగబోయే ఈ ప్రతిష్టాత్మక సమావేశంలో వర్షాభావ పరిస్థితులు, తాగునీటి లభ్యత, జలాశయాల్లో నీటి నిల్వలు, వ్యవసాయ మరియు ఉద్యాన పంటల స్థితిగతులు, ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక, భూగర్భ జలాల పరిస్థితి, విద్యుత్ సరఫరా, నీటి సంరక్షణ చర్యలు తదితర కీలక అంశాలపై శాఖల వారీగా సమగ్ర వివరాలతో పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను సూచించారు. ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారుల సమన్వయంతో జిల్లా ఇన్‌చార్జి మంత్రుల అధ్యక్షతన ఈ సమీక్షలు జరుగుతాయని, కాబట్టి అధికారులు ఎలాంటి అలసత్వం వహించకుండా పూర్తి బాధ్యతతో వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ పాండు, జడ్పీ సీఈఓ జానకిరెడ్డి, డీఆర్‌డీఓ (పీడీ) జ్యోతి మరియు సంబంధిత శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ కాలనీ ప్రజలకు తప్పని తిప్పలు.. పట్టించుకోని అధికారులు



అనంతగిరి, జూలై 18 (సందేశం టైమ్స్ ప్రతినిధి): అనంతగిరి మండలం వెంకట్రాంపురం గ్రామ శివారులోని ఇందిరమ్మ కాలనీ ప్రజలు కనీస వసతులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలనీలో నివసించే గర్భిణీలు, చిన్నారులు, వృద్ధులు పాఠశాల, అంగన్వాడీ కేంద్రం, రేషన్ సరుకులు, పింఛన్ వంటి అవసరాల కోసం ప్రతిరోజూ రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న వెంకట్రాంపురం గ్రామానికి నడిచి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. కొన్నేళ్లుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్తున్నప్పటికీ ఎలాంటి పరిష్కారం లభించలేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఇందిరమ్మ కాలనీకి రహదారి, మౌలిక వసతులు కల్పించి తమ ఇబ్బందులు తొలగించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



## యువ సంగ్రామ సదస్సుకు సంగారెడ్డి నుంచి భారీగా తరలిన విద్యార్థులు, యువజన నాయకులు

సంగారెడ్డి, జూలై 19 (సందేశం టైమ్స్ ప్రతినిధి): కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ప్రకటించిన యూత్ డిక్లరేషన్ హామీలను అమలు చేయకుండా విద్యార్థులు, నిరుద్యోగ యువతను మోసం చేసిందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న యువ సంగ్రామ సదస్సుకు సంగారెడ్డి నియోజకవర్గం నుంచి విద్యార్థులు, యువజన నాయకులు భారీగా తరలివెళ్లారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ ఆదేశాల మేరకు యువ కిశోరం చింతా సాయినాథ్ పర్యవేక్షణలో విద్యార్థులు, యువజన నాయకులు ఉత్సాహంగా సదస్సుకు బయలుదేరారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం నిరుద్యోగ భృతి, ఉద్యోగాల భర్తీ, పరీక్షల నిర్వహణ, యువత సంక్షేమానికి ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. యువత సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి హక్కుల సాధన కోసం నిర్వహిస్తున్న యువ సంగ్రామ సదస్సు విజయవంతం అవుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి విభాగం అధ్యక్షుడు శ్రీహరి, జిల్లా కోఆర్డినేటర్ రాజేందర్ నాయక్, కౌన్సిలర్ సోమశేఖర్, యువజన విభాగం అధ్యక్షుడు వాజీద్ తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## అర్ధరాత్రి ఆటో బోల్తా.. యువకుడికి తీవ్ర గాయాలు

పటాన్‌చెరు, జూలై 19 (సందేశం టైమ్స్ వి. సాయి ప్రతినిధి): పటాన్‌చెరు మండలం ఇంద్రేశం మున్సిపాలిటీ శివారులో శుక్రవారం అర్ధరాత్రి ఆటో బోల్తా పడిన ఘటనలో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం నగేష్ (25) ఆటో నడుపుతూ వెళ్తుండగా అదుపుతప్పి బోల్తా పడింది. మద్యం మత్తులో వాహనం నడపడం వల్లే ప్రమాదం జరిగినట్లు స్థానికులు తెలిపారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన నగేష్‌ను ప్రాథమిక చికిత్స అనంతరం జిల్లా ఆసుపత్రికి తరలించగా, పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.



## సింగూర్ ప్రభుత్వ పాఠశాలలో పోషక సమావేశం

సంగారెడ్డి, జూలై 19b(సందేశం టైమ్స్ పుల్కల్ మండల ప్రతినిధి మహేష్ బాబు): పుల్కల్ మండలం సింగూర్ ప్రభుత్వ పాఠశాలలో పోషక సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన తల్లిదండ్రులను ఆహ్వానించి తరగతి గదుల్లో కూర్చోబెట్టి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఈ విద్యా సంవత్సరంలో ప్రతి నెల 6, 7 తేదీలలో ఆన్‌లైన్ ద్వారా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థుల పాఠ్యాంశాలపై పట్టు పెంచేందుకు వారిచే పాఠ్యపుస్తకంలోని భాగాలను చదివించడం, బ్లాక్ బోర్డుపై గణిత సమస్యలు పరిష్కరించడం, విద్యార్థులు రూపొందించిన చిత్రాలు, బొమ్మలను ప్రదర్శించడం ద్వారా వారి ప్రతిభను వెలికితీస్తున్నామని ఉపాధ్యాయులు తెలిపారు. విద్యార్థుల అభ్యసనా స్థాయిలను పెంచేందుకు తల్లిదండ్రులు ఇంటి వద్ద చదివించడం, హోంవర్క్ చేయించడం, పిల్లల ఆరోగ్యం, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, బడిఈడు కలిగిన పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించి క్రమం తప్పకుండా హాజరయ్యేలా చూడాలని కోరారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులతో ఆరు వాక్యాల వాగ్దానం చేయించి, అందులో కనీసం ఒక వాగ్దానాన్ని నెల రోజుల పాటు పాటించాలని సూచించారు. అనంతరం తల్లిదండ్రుల అభిప్రాయాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ ఇంచార్జి సత్యం, ప్రైమరీ స్కూల్ ఇంచార్జి ఉమారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## యువ సంగ్రామ సదస్సుకు తరలిరండి: ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



పటాన్‌చెరు, జూలై 19 (సందేశం టైమ్స్ వి. సాయి ప్రతినిధి): యువ సంగ్రామ సదస్సును విజయవంతం చేయాలని పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పిలుపునిచ్చారు. పటాన్‌చెరు నియోజకవర్గం నుంచి సరూర్‌నగర్‌లో నిర్వహించే ఈ సదస్సుకు బీఆర్ఎస్ శ్రేణులు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నట్లు ఆయన తెలిపారు. యువత ఆకాంక్షలకు వేదికగా ఈ సదస్సును నిర్వహిస్తున్నామని, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.




## ప్రభుత్వ పాఠశాలల నుంచే గొప్ప విజయాలు సాధ్యం: మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి

మెదక్, జూలై 19 (సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గ ప్రతినిధి): ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులు పెద్ద లక్ష్యాలను నిర్దేశించుకుని క్రమశిక్షణతో కష్టపడితే దేశంలోనే అత్యున్నత స్థానాలను చేరుకోవచ్చని రాష్ట్ర శక్తి (కార్మిక, ఉపాధి, శిక్షణ & ఫ్యాక్టరీలు), గనుల శాఖ మంత్రి డా. జి. వివేక్ వెంకటస్వామి అన్నారు. మెదక్ జిల్లా చేగుంట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం Sureify School Kits ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి విద్యార్థులకు ఉచిత స్కూల్ బ్యాగులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు కేవలం బ్లాక్‌బోర్డులకే పరిమితం కాకుండా ప్రపంచాన్ని చూసే అవకాశాలను కల్పిస్తున్నాయని తెలిపారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులు కష్టపడి చదివి ఐఐటీలు, మెడికల్, ఇంజినీరింగ్ వంటి ప్రతిష్టాత్మక సంస్థల్లో సీట్లు సాధిస్తున్నారని, చేగుంట పాఠశాల నుంచి ఇద్దరు విద్యార్థులు ఐఐఐటీలో ప్రవేశం పొందడం ఉపాధ్యాయుల నిబద్ధతకు నిదర్శనమన్నారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఒక స్పష్టమైన లక్ష్యం ఉండాలని, డాక్టర్, ఐఏఎస్, ఇంజనీర్ వంటి ఉన్నత లక్ష్యాలను సాధించేందుకు క్రమశిక్షణతో కృషి చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తోందని, CSR నిధులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో విద్యాభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. సంపాదనలో కొంత భాగాన్ని సమాజానికి వెచ్చించడం దాతృత్వం మాత్రమే కాకుండా ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. విద్యతో పాటు నైపుణ్యాభివృద్ధి కూడా కీలకమని, మారుతున్న సాంకేతిక పరిజ్ఞానానికి అనుగుణంగా యువతకు ఆధునిక శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. చేగుంట ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయిన ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి మంజూరుకు కృషి చేస్తానని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల, ఇంటర్మీడియట్ కళాశాల ప్రిన్సిపాళ్లు, Sureify సంస్థ ప్రతినిధులు, సంకల్ప్ సంస్థ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి

మెదక్, జూలై 19 (సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గ ప్రతినిధి): నర్సాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఆవుల రాజిరెడ్డి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మాసాయిపేట మండలం బొమ్మారం గ్రామంలో ఎం.పి.పి.ఎస్. (MPPS) పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి నిర్వహించిన భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని పనులను ప్రారంభించారు. అనంతరం అదే గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొని వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శివ్వంపేట మండలం గోమారం గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ది విలేజ్ కిచెన్ రెస్టారెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని నిర్వాహకులను అభినందించారు. వ్యాపార రంగంలో మంచి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుహాసిని రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



## ఎస్ఎస్‌కే సమాజ్ జోగిపేట నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

జోగిపేట, జూలై 19 (సందేశం టైమ్స్ అందోల్ మండల ప్రతినిధి): సంగారెడ్డి జిల్లా జోగిపేటకు చెందిన సోమవంశ సహస్రార్జున క్షత్రియ (ఖత్రి) సమాజ్ (ఎస్ఎస్‌కే సమాజ్) నూతన కార్యవర్గాన్ని సమాజ్ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ అధ్యక్షుడిగా రత్నపూరి వెంకటేష్, ఉపాధ్యక్షుడిగా రత్నపూరి సంతోష్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా శ్రావణ్ నందుకుమార్, సహాయ కార్యదర్శిగా పూజారి రమేష్, కోశాధికారిగా రత్నపూరి గోపీనాథ్, సహ కోశాధికారిగా మేఘరాజ్ రాజేష్ ఎన్నికయ్యారు. సలహాదారులుగా రత్నపూరి నాగరాజు, రత్నపూరి చందర్, చవాన్ సిద్ధేశ్‌లను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రత్నపూరి వెంకటేష్ మాట్లాడుతూ సమాజంలోని ప్రతి సభ్యుడిని కలుపుకొని సమిష్టి సహకారంతో ఎస్ఎస్‌కే సమాజ్ అభివృద్ధి, సంక్షేమం కోసం కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి ఏకగ్రీవంగా ఎన్నుకున్న సమాజ్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. నూతన కార్యవర్గ సభ్యులకు సమాజ్ సభ్యులు శుభాకాంక్షలు తెలియజేస్తూ వారి నాయకత్వంలో సమాజ్ మరింత అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు.



## పురాతన, వారసత్వ సంపదకు నిలయం మెదక్ జిల్లా: సినీ నటుడు మంచు విష్ణు

హైదరాబాద్, సందేశం టైమ్స్ ప్రతినిధి, జులై 19, 2026: మెదక్ జిల్లా పురాతన, వారసత్వ సంపదకు నిలయమని 'మా' (MAA) అసోసియేషన్ అధ్యక్షుడు, సినీ నటుడు, నిర్మాత మంచు విష్ణు పేర్కొన్నారు. శనివారం జిల్లాలో టూరిజం అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా ఆయన ఏడుపాయల వన దుర్గా భవానీ మాత ఆలయానికి చేరుకోగా, జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ మొక్కను అందించి ఘన స్వాగతం పలికారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆలయంలోకి తీసుకెళ్లగా, మంచు విష్ణు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఆలయ చరిత్ర, ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం చారిత్రక నేపథ్యం కలిగిన మెదక్ ఖిల్లాను, ప్రపంచ ప్రసిద్ధిగాంచిన మెదక్ సీఎస్ఐ కేథడ్రల్ చర్చిని మంచు విష్ణు సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మనకున్న చారిత్రక సంపద ప్రపంచంలో మరే దేశానికి లేదని, ఆ చరిత్రను కాపాడుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని అన్నారు. జిల్లా యంత్రాంగం ఇక్కడి పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి మాస్టర్ ప్లాన్ తయారు చేయడం అభినందనీయమని, హైదరాబాద్‌కు ఇంత దగ్గరగా ఉన్న ఈ అద్భుత ప్రాంతాలను భవిష్యత్తులో తాను నటించే లేదా నిర్మించే సినిమాల్లో చూపిస్తానని, ఇక్కడి నుంచి ఒక సినిమాకు అవకాశం ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా టూరిజం శాఖ అధికారి రమేష్, మున్సిపల్ కమిషనర్ నవీన్, మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్లు, డీఎస్పీ ప్రసన్న కుమార్, మీడియా ప్రతినిధులు పాల్గొన్నారు.

## గువ్వల బాలరాజుపై ఈడీ, సీబీఐ విచారణ జరపాలి: కత్తి నాగబాబు



సూర్యాపేట, జూలై 19 (సందేశం టైమ్స్ సూర్యాపేట జిల్లా కోఆర్డినేటర్ సోమయ్య కంభంపాటి): మునగాల మండల కేంద్రంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీనియర్ స్వేరో కత్తి నాగబాబు మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే, బీజేపీ నాయకుడు గువ్వల బాలరాజు చేసిన ఆరోపణలను ఖండించారు. గురుకులాల్లో అవినీతి జరిగిందని, డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సెక్రటరీగా ఉన్న సమయంలో అవినీతికి పాల్పడ్డారని చేస్తున్న ఆరోపణలు నిరాధారమైనవని ఆయన పేర్కొన్నారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ 10 సంవత్సరాల పాటు గురుకులాల సెక్రటరీగా పనిచేసి లక్షలాది మంది విద్యార్థుల జీవితాల్లో మార్పు తీసుకొచ్చారని అన్నారు. అదే సమయంలో గువ్వల బాలరాజు ఎమ్మెల్యేగా పనిచేసిన కాలంలో అక్రమంగా సంపాదించారనే ఆరోపణలపై ఈడీ, సీబీఐ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌పై విచారణ జరపడంలో తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అయితే గువ్వల బాలరాజుకు సంబంధించిన అక్రమాలు, విదేశాల్లోని కంపెనీలు, పెట్టుబడులపై కూడా సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కోరారు.



## ఆయిల్ పామ్ సాగుతో రైతులకు సమృద్ధిగా లాభాలు: కలెక్టర్ ప్రతిమా సింగ్

మెదక్, జూలై 19 (సందేశం టైమ్స్ మెదక్ నియోజకవర్గ ప్రతినిధి): జిల్లాలో రైతులందరూ సుస్థిర వ్యవసాయం దిశగా అడుగులు వేయాలని, వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్ పామ్ సాగుపై దృష్టి సారించి అధిక ఆదాయం పొందాలని మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ సూచించారు. శంకరంపేట(ఆర్) మండలం సూరారం గ్రామంలో రైతులు శ్రీ సత్యనారాయణ, రాజు, జగదీశ్ సాగు చేస్తున్న మూడేళ్ల ఆయిల్ పామ్ తోటను సందర్శించిన కలెక్టర్ తొలిసారిగా వచ్చిన ఆయిల్ పామ్ పంట కోతను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 2023-24 నుంచి ఇప్పటివరకు 1857 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు జరిగిందని, 2026-27 సంవత్సరానికి 2500 ఎకరాల లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు. రైతులు మార్కెట్ డిమాండ్ ఉన్న పంటల వైపు దృష్టి సారించాలని, ఆయిల్ పామ్‌కు ప్రభుత్వం పలు రాయితీలు అందిస్తోందని పేర్కొన్నారు. మొక్కలపై సబ్సిడీతో పాటు నాలుగేళ్ల పాటు తోట నిర్వహణ, అంతర పంటల సాగుకు ప్రోత్సాహకాలు నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేస్తున్నట్లు తెలిపారు. ఒక రైతుకు గరిష్టంగా 12.50 ఎకరాల వరకు డ్రిప్ పరికరాలపై రాయితీ అందుతుందని చెప్పారు. ఆయిల్ పామ్ సాగులో నాలుగేళ్ల తర్వాత ఎకరానికి 10 నుంచి 12 టన్నుల దిగుబడి వస్తుందని, ప్రస్తుతం టన్నుకు రూ.23,852 ధర ఉండటంతో రైతులు మంచి ఆదాయం పొందే అవకాశం ఉందన్నారు. ఒక ఎకరా వరికి ఉపయోగించే నీటితో ఐదు ఎకరాల వరకు ఆయిల్ పామ్ సాగు చేయవచ్చని, మధ్యవర్తులు లేకుండా కంపెనీలు నేరుగా కొనుగోలు చేస్తాయని తెలిపారు. మొదటి నాలుగేళ్లు అంతర పంటల ద్వారా ఆదాయం పొందవచ్చని, అనంతరం కోకో, వక్క వంటి పంటలను సాగు చేసి అదనపు ఆదాయం పొందవచ్చని కలెక్టర్ వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి ప్రతాప్ సింగ్, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు, ఎం/ఎస్ లివ్ పామ్ రిసోర్సెస్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధులు, మైక్రో ఇరిగేషన్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



## ఎల్‌నినో ప్రభావంపై రైతులకు పంటల సాగుపై అవగాహన

మెదక్/అల్లాదుర్గం, జూలై 19 (సందేశం టైమ్స్ మెదక్ జిల్లా ఇంచార్జి అనిల్ కుమార్): అల్లాదుర్గం మండలం గడిపెద్దాపూర్ రైతు వేదికలో ఎల్‌నినో ప్రభావం, వర్షాభావ పరిస్థితులు, ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి రాజేష్ మాట్లాడుతూ తక్కువ నీటితో సాగు చేసే చిరుధాన్యాలు, పప్పు, నూనెగింజల పంటలపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. వర్షాభావ పరిస్థితులు ఏర్పడినప్పుడు నీటి వినియోగంలో జాగ్రత్తలు పాటిస్తూ, పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని రైతులకు వివరించారు. ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వాతావరణ మార్పులపై రైతులు అప్రమత్తంగా ఉండాలని, ప్రత్యామ్నాయ పంటల సాగు ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు. రైతులకు అవగాహన కల్పించే కార్యక్రమాలను రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలని ప్రభుత్వం సూచిస్తున్నట్లు వెల్లడించారు.

## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి: కర్చల్ దడువై పవన్ కుమార్



రాయికోడ్, జూలై 19 (సందేశం టైమ్స్ ప్రతినిధి): వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో మండల ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని రాయికోడ్ మండల రాష్ట్ర వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం అధ్యక్షులు కర్చల్ దడువై పవన్ కుమార్ సూచించారు. స్థానిక విలేకరులతో మాట్లాడుతూ వాతావరణ మార్పుల కారణంగా మలేరియా, డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలు ముందస్తు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు కాచి వడగట్టిన నీటిని తాగాలని, దోమలు వృద్ధి చెందకుండా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, గుంతలు, పగిలిన పాత్రల్లో నీరు నిల్వ కాకుండా చూడాలని, ఇళ్ల చుట్టూ పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలను తొలగించి దోమల నివారణకు దోమతెరలు వినియోగించాలని తెలిపారు. జ్వరం, దగ్గు లేదా ఇతర అనారోగ్య లక్షణాలు కనిపించిన వెంటనే నిర్లక్ష్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని, వైద్యుల సూచనల మేరకే మందులు వాడాలని విజ్ఞప్తి చేశారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల శుభ్రత పాటించడం ద్వారా సీజనల్ వ్యాధులను నివారించవచ్చని పవన్ కుమార్ పేర్కొన్నారు.



## తక్కువ ధరకు బంగారం పేరుతో రూ.85.70 లక్షల మోసం.. అంతర్రాష్ట్ర నేరగాళ్ల అరెస్ట్

ఖమ్మం, జూలై 19 (సందేశం టైమ్స్ ఖమ్మం ఇంచార్జి శెట్టి సురేష్): తక్కువ ధరకు బంగారం ఇప్పిస్తామని నమ్మబలికి రూ.85.70 లక్షలు మోసం చేసిన ఇద్దరు అంతర్రాష్ట్ర నేరగాళ్లను కామేపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. సింగరేణి సర్కిల్ పరిధిలోని కామేపల్లి మండలంలో జరిగిన ఈ ఘటనపై సింగరేణి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్. సాగర్ ఆధ్వర్యంలో చేపట్టిన దర్యాప్తులో నిందితులను అదుపులోకి తీసుకుని కీలక ఆధారాలు స్వాధీనం చేసుకున్నారు. అరెస్టైన వారిలో కామేపల్లి మండలం బాసిత్‌నగర్‌కు చెందిన బానోత్ సాయికుమార్ (20), కర్ణాటక రాష్ట్రం బెంగళూరుకు చెందిన నారాయణప్ప గురప్ప అలియాస్ ఆనంద రెడ్డి అలియాస్ హరి ప్రసాద్ అలియాస్ బోగా లక్ష్మీనారాయణ (63) ఉన్నారు. ప్రధాన నిందితుడు గురప్ప గతంలో వివిధ రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగాలు, భూములు, తక్కువ ధరలో బంగారం ఇప్పిస్తానని చెప్పి మోసాలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఖమ్మం జిల్లాకు వచ్చి బోగా లక్ష్మీనారాయణ అనే నకిలీ పేరుతో అయ్యప్ప స్వామి మాల ధరించి ఆధ్యాత్మిక వ్యక్తిగా గ్రామాల్లో పరిచయం పెంచుకుని ప్రజల విశ్వాసాన్ని పొందినట్లు వెల్లడించారు. అనంతరం తన డ్రైవర్ సాయికుమార్‌తో కలిసి 2026 ఫిబ్రవరి నుంచి తక్కువ ధరలో బంగారం ఇప్పిస్తామని చెప్పి పలువురి వద్ద నుంచి భారీ మొత్తంలో నగదు వసూలు చేసి పరారయ్యారు. కామేపల్లి మండలం పరిసర ప్రాంతాలకు చెందిన 18 మంది బాధితుల నుంచి మొత్తం రూ.85.70 లక్షలు వసూలు చేసినట్లు విచారణలో వెల్లడైంది. మోసం చేసిన డబ్బును పూజలు, అన్నదాన కార్యక్రమాలు, శబరిమల, ఏడుపాయల యాత్రలు, దేవాలయ ఉత్సవాలు, విలాసవంతమైన జీవనం, పాత అప్పుల చెల్లింపులు తదితర వాటికి ఖర్చు చేసినట్లు నిందితులు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి మారుతి ఈకో కారు, రెండు మొబైల్ ఫోన్లు, బోగా లక్ష్మీనారాయణ పేరుతో ఉన్న నకిలీ ఆధార్ కార్డును స్వాధీనం చేసుకున్నారు. గురప్ప తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో వివిధ పేర్లతో తిరుగుతూ కోట్ల రూపాయల మేర మోసాలకు పాల్పడినట్లు విచారణలో తేలిందని పోలీసులు తెలిపారు. తక్కువ ధరలో బంగారం, భూములు, ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే మోసగాళ్లను నమ్మి డబ్బులు ఇవ్వవద్దని, అనుమానాస్పద వ్యక్తుల సమాచారం వెంటనే పోలీసులకు అందించాలని పోలీసులు ప్రజలకు సూచించారు.




## ఖమ్మంలో వైభవంగా 'స్తంభద్రి ఐకాన్ 2026' ప్రారంభం: మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్

ఖమ్మం, సందేశం టైమ్స్ ప్రతినిధి, జులై 19, 2026: ఖమ్మం నగరంలోని మమతా మెడికల్ కాలేజీలో తెలంగాణ స్టేట్ 11వ ఆప్తాల్మాలజికల్ కాన్ఫరెన్స్ (స్తంభద్రి ఐకాన్ 2026)ను మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ జ్యోతిప్రజ్వలన చేసి అధికారికంగా ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన వర్క్ కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ, 'సర్వేంద్రియానాం నయనం ప్రధానం' అని, అన్ని దానాల కన్నా నేత్రదానం ఎంతో మిన్న అని పేర్కొన్నారు. దేశంలో ఎన్ని అత్యాధునిక ఆసుపత్రులు అందుబాటులోకి వచ్చినప్పటికీ కంటి సమస్యలతో బాధపడే వారి సంఖ్య ఇంకా ఎంతో ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో వైద్య రంగంలో వస్తున్న నూతన మార్పులపై చర్చించేందుకు మన ఖమ్మం నగరంలో ఈ రాష్ట్ర స్థాయి కాన్ఫరెన్స్ నిర్వహించడం ఎంతో సంతోషకరమని హర్షం వ్యక్తం చేశారు. ఈ విజ్ఞాన సదస్సుకు ముఖ్య అతిథిగా మాజీ ఐఏఎస్ అధికారి జయప్రకాష్ నారాయణ హాజరై ప్రసంగించారు. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో మమతా మెడికల్ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ పువ్వాడ నరేన్, ప్రముఖ వైద్యాధికారులు డాక్టర్ విజయ్ కుమార్, డాక్టర్ ప్రవీణ్ కృష్ణ, డాక్టర్ కె.బి. నందకిషోర్, డాక్టర్ ప్రవీణ్ మరియు పలువురు వైద్య నిపుణులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

పత్రిక పేరు: సందేశం టైమ్స్ (Sandesham Times)- రిజిస్ట్రేషన్ నం: TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times, (పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ- 508206, ప్రచురణకర్త /publisher: కాసే అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: నండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్- 522006.